క్లుప్తంగా

రైతులందరికీ ఈకేవైసీ

రొంపిచర్ల: మండలంలోని రైతులు అందరూ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివలలిత తెలిపారు. రైతులందరూ సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వీఏఏలను సంప్రదించాలన్నారు

మిస్సింగ్ కేసు నమోదు

నాదెండ్ల: నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు సాతులూరు గ్రామానికి చెందిన పోపూరి వసంతరావు పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రభుత్వ సామాజిక భద్రతా పింఛను పొందుతున్నాడు. గతేడాది ఆగస్టు 1వ తేదీన పెన్షన్ తీసుకుని ఇంటి నుంచి వెళ్ళాడు. తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, పలు ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవటంతో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రెడ్‌క్రాస్ శిబిరంలో 21 మంది రక్తదానం



నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో ప్రపంచ రక్తదాన వారోత్సవాల్లో భాగంగా శిబిరం నిర్వహించారు. 21 మంది రక్తదానం చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏవీ రమణ మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో రక్తదానం మరొకరి ప్రాణాలు నిలిపేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా 21 మంది రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, వజ్జా సింగయ్య, మదన్‌మోహన్, నాగపూర్ణ చంద్రరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఈవోగా సుధాకర్‌రెడ్డి



వినుకొండ: దేవదాయ శాఖ అధికారిగా సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన హనుమంతురావు బదిలీపై కారంపూడి వెళ్లగా మదమంచిపాడు ఈవోగా పనిచేస్తున్న ఆయనకు వినుకొండ దేవదాయ అధికారిగా రెగ్యులర్ పోస్టులో నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయశాఖలో పెండింగ్‌లో పనులు వేగవంతం చేస్తామని తెలిపారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

ఏపీవో కోటమ్మ



పెదకూరపాడు: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఏపీవో కోటమ్మ తెలిపారు. గురువారం పెదకూరపాడులో ఉపాధి కార్మికులతో ఆమె సమావేశం నిర్వహించారు. కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పనులు చేస్తున్నట్లు చెప్పారు. పనుల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒకరి పేరుపై మరొకరు పనులకు రావద్దని కార్మికులకు సూచించారు.

రైతులు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి

ఏవో కె.దేవదాసు

నకరికల్లు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలను పొందేందుకు అర్హత కలిగిన రైతులందరూ రైతుసేవ కేంద్రంలో ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. మండలంలో 9,717 మంది రైతులను అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. రైతు పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు.

సత్తెనపల్లి ఏవోగా సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిగా బి.సుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారెడ్డి బదిలీపై సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి(ఏవో)గా వచ్చారు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీధర్‌రెడ్డి బదిలీపై ముప్పాళ్ల మండల వ్యవసాయ అధికారిగా వెళ్లారు.

ఎప్పుడొస్తుందో... ఎప్పుడు పోతుందో!?

- వినుకొండలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం
- ఒక్కోసారి హైఓల్టేజీతో సరఫరా
- కాలిపోతున్న గృహోపకరణాలు
- అల్లాడుతున్న వినియోగదారులు



వినుకొండ విద్యుత్ కార్యాలయం


దక్షిణం బజారులో కాలిపోయిన ఫ్యాను

వినుకొండ: గత పది రోజులుగా వినుకొండ పట్టణంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉంటోంది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని పాత శివాలయం, మెయిన్ బాజారు, కుమ్మరి బజారు, దక్షిణం బజారులతోపాటు ఓల్డు టౌన్‌లో విద్యుత్ సరఫరాలో ఓల్టేజీ, లేదా హైఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో రాత్రి సమయంలో హైఓల్టేజీ రావటంతో ఇళ్లలోని ఫ్యాన్లు, బల్బులు, టీవీలు తోపాటు పలు గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో ప్రజలు రిపేరు షాపులకు పరుగులు తీశారు.

సరఫరాలో హెచ్చుతగ్గులు!

ఇటీవల కాలంలో పట్టణంలో విద్యుత్ సరఫరా తరచూ అంతరాయం కల్గుతోంది. విద్యుత్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పట్టణంలో మరమ్మతులు జరుతున్నప్పటికీ సమయపాలన లేకపోవటం రాత్రివేళల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతోంది. వేళాపాళా లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో ప్రజలు విసిగిపోతున్నారు.

ఇళ్లలో ఉండలేక – బయటకు పోలేక!

ఇటీవల కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోతతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలో ఉండలేక – బయటకు పోలేక విచిత్ర వాతావరణ పరిస్థితుల మధ్య అల్లాడిపోతున్నారు.

దీనికితోడు విద్యుత్ సరఫరాలో అస్తవ్యస్తంగా ఉండటం కూడా వారిపాలిట శాపంగా మారింది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, మెరుగైన విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఫ్యాన్లు, టీవీ కాలిపోయాయి



వారం రోజుల క్రితం ఒక్కసారిగా రాత్రివేళ హై ఓల్టేజీ రావటంతో ఇంటిలోని ఫ్యాన్లు, టీవీ కాలిపోయాయి. అలాగే తరచూ సరఫరాలో అంతరాయం కల్గుతోంది. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో చెప్పలేని పరిస్థితి ఉంది. అధికారుల స్పందించి చర్యలు చేపట్టాలి.

–ఎ.మల్లీశ్వరి, వినుకొండ టౌన్

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు పెడుతున్నాం

ఈదురుగాలులు, వర్షాలు చెట్లు విరిగి తీగలపై పడటం వంటి సందర్భాలలో హై ఓల్టేజీ రావచ్చు. కొన్నిసార్లు సాంకేతిక కారణాల వల్ల కూడా విద్యుత్ సరఫరాలో లో–హైఓల్టేజీ సమస్య రావచ్చు. అంతేకాకుండా ఇటీవల కాలంలో డిమాండ్‌కు మించి విద్యుత్ వినియోగం వల్ల కూడా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. రూ.25 లక్షల బడ్జెట్‌తో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు త్వరలోనే ఏర్పాటు చేస్తాం. సమస్యను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తాం.

–పిచ్చయ్య, విద్యుత్ ఏ.ఈ.ఈ వినుకొండ

వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలేవీ?

ఎస్‌ఎఫ్‌ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్



నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవటంలో ఆశాఖ అధికారులు నిద్రమత్తు పాటిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యనే వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు జిల్లాలో విపరీతంగా పెరిగిపోయాయన్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల ప్రాంతాలలో పుట్టగొడుగులుగా ఏర్పాటుచేసి విద్యార్థులను, తల్లిదండ్రులను అధిక ఫీజులు, పుస్తకాల పేర్లతో వేలు వసూలు చేస్తూ దందా చేస్తున్నారన్నారు. అటువంటి వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించటం శోచనీయమన్నారు. అధిక ఫీజులు, పుస్తకాలు పేరుతో దోపిడీని అరికట్టాలని తాము రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ఆందోళనపై కూడా ఏమీ తెలియనట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చినటువంటి హామీ ప్రకారం ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికడతామని చెప్పారని, ఏడాది గడుస్తున్నా దీనిపై కనీసం కూటమి ప్రభుత్వానికి ఆలోచనే చేయటంలేదన్నారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని సీజ్‌చేసి పాఠశాల గుర్తింపు రద్దుచేయని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రతి మండలా నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సర్వేపల్లి రాధా కృష్ణ విద్యా మిత్ర (ఎస్‌ఆర్‌కేవీఎం) పథకం క్రింద విద్యార్థులందరికీ పుస్తకాలు పంపిణీ చేశారు. విప్పర్ల రెడ్డిపాలెం గ్రామంలో పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాల్లో విద్యా ర్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలను కూడా అందించారు. 6వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్, ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ ఇంటర్ మొదట సంవత్సరం నూతన అడ్మిషన్లు ప్రవేశాలు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల జూనియర్ ఇంటర్ కళాశాలలో మొదట సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపులకు సంబంధించి 20 అడ్మిషన్లు వచ్చినట్లు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు సమీక్షి కృషి వలన మెరుగైన ఫలితాలు సాధించటం వలన బాలికల కళాశాల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. అలాగే 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చాయని, కార్పొరేటు పాఠశాలల తరహాలో నాణ్యమైన బోధన ప్రభుత్వం అందించే సౌకర్యాలు విద్యార్థుల తల్లిదండ్రులు అవగాహన కల్పించటం వలన శావల్యాపురం హైస్కూల్లో చేరేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. సైన్సు ఉపాధ్యాయులు వున్నం శ్రీనివాసరావు, శ్రీకాంత్, సురేష్ ఉన్నారు.


సైన్సు ఉపాధ్యాయుడి నుంచి అడ్మిషను తీసుకుంటున్న విద్యార్థి

ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: ఎస్‌బీఐ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణప్రసాద్ ప్రభు తెలిపారు. మండలంలోని రావిపాడు గ్రామంలో రైతు రుణ అవగాహన సదస్సును గురువారం రాత్రి నిర్వహించారు. ప్రకాష్‌నగర్ ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, చీఫ్ మేనేజర్‌లు బాలగణేష్, బాలాజీ, ప్రకాష్‌నగర్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పాల్ బెజాలిల్, బ్రాంచ్ మేనేజర్ రత్నరాజు, ఫీల్డ్ ఆఫీసర్ ఎం.రమణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతుల కోసం ఎస్‌బీఐ పలు పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. కిసాన సమృద్ధి రిన్, స్వయం సిద్ధ వంటి పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించిన రైతులను సన్మానించారు. బ్యాంక్ అందిస్తున్న సేవలపై కళారూపాల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.


రుణ అవగాహన సదస్సులో పాల్గొన్న ఎస్‌బీఐ అధికారులు

అమలు కాని కూటమి హామీలు

ప్రజల ఆశలపై నీళ్లు

- సీపీఐ పల్నాడు కార్యదర్శి మారుతి వరప్రసాద్ ఆగ్రహం
- బోయపాలెంలో సీపీఐ మహాసభ
- వందేళ్ల కమ్యూనిస్టుల త్యాగాలను స్మరించుకున్న నాయకులు
- మతసామరస్యం, ప్రజాస్వామ్యం కాపాడండి! అంటూ ఆవేదన




మహాసభలో మాట్లాడుతున్న మారుతి వరప్రసాద్

యడ్లపాడు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఐ మండలం కార్యదర్శి దాసరి వరహాలు అధ్యక్షతన బోయపాలెంలో గురువారం జరిగిన సిపిఐ మహాసభలో మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను విడనాడాలని, మైనార్టీల హక్కులను కాపాడాలని ఆయన కోరారు. అమాయక ఆదివాసీల హత్యలను తీవ్రంగా విమర్శించారు. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుపేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం అలాగే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. వయోవృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు, రేషన్ కార్డులు వెంటనే అందించాలని కోరారు. నియోజకవర్గ పార్టీ కార్యదర్శి తాళ్లూరు బాబురావు మాట్లాడుతూ, కమ్యూనిస్టు ఉద్యమం భారత స్వాతంత్ర్యం, ప్రజల హక్కుల కోసం చేసిన త్యాగాలను గుర్తుచేశారు. జిల్లాలో జూలైలో జరగనున్న సీపీఐ మహాసభలకు ప్రస్తుత సమావేశం పునాదిగా నిలుస్తుందని తెలిపారు. సమావేశంలో ఐసీఐ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా దాసరి వరహాలు, సోమరాజు రామాంజనేయులు, ఇతర నాయకులను ఎన్నుకున్నట్లు నాయకులు వెల్లడించారు.

మోదీతో దేశం అభివృద్ధి పయనం

సమావేశంలో స్పష్టం చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి


మాట్లాడుతున్న జయప్రకాష్, నాయకులు

నరసరావుపేట: దేశంలో 2014లో ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టాక దేశం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో జిల్లా, స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. గత 11 ఏళ్లలో ప్రపంచంలో పదో స్థానంలో ఉన్న దేశ ఆర్థిక రంగం ఇప్పుడు నాల్గవ స్థానానికి చేరిందన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ 4.5 ట్రిలియన్‌కు చేరిందన్నారు. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం కటిక దరిద్రం కిందనున్న 27 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యాన్ని అధిగమించటంతో పేదలు ఐదు కోట్లకు మాత్రమే పరిమితమయ్యారన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకొని బీజేపీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. ప్రజలను నాలుగు వర్గాలుగా పేదలు, మహిళలు, యువకులు, రైతులు విభజించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. గరీబ్ కల్యాణ్ యోజన పేరుతో 81 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో పేదలందరికీ రూ.5 లక్షలు చొప్పున ఉచిత వైద్యసేవలు అందజేస్తున్నారన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం 23 కోట్ల మందికి స్వచ్ఛభారత్ అభియాన్ పేరుతో మరుగుదొడ్ల నిర్మాణం చేశారన్నారు. చందన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు మహిళలకు ఏర్పాటు చేశారన్నారు. ముద్ర యోజనతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ పావలా వడ్డీకి రూ.25 లక్షల వరకు రుణం అందజేస్తుందన్నారు. సమావేశంలో ప్రోగ్రాం కన్వీనర్ కపర్ది, జిల్లా అధ్యక్షులు శశికుమార్, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు, వల్లెపు కృపారావు, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పి.రవిశంకర్, పార్లమెంట్ కన్వీనర్ చిరుమామిళ్ల ఆదినారాయణ, జనరల్ సెక్రటరీ మేడం రమేష్ పాల్గొన్నారు.

మోగిన బడి గంట

- రొంపిచర్లలో తొలిరోజు 58 శాతం విద్యార్థులు హాజరు
- పాఠశాలలకు చేరని యూనిఫాం


రొంపిచర్లలో బడికి వెళ్తున్న విద్యార్థులు


గణపవరం జెడ్పీ హైస్కూలులో నూతన ప్రవేశదరఖాస్తులు తీసుకుంటున్న హెచ్‌ఎం


గణపవరం హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో అరకొరగా హాజరైన విద్యార్థులు


గణపవరం జీపీ క్వార్టర్స్ ప్రాథమిక పాఠశాలలో వర్షపునీటితో ఆటస్థలం

రొంపిచర్ల: వేసవి సెలవులు అనంతరం మండలంలోని పాఠశాలలు అన్ని గురువారం పునః ప్రారంభమయ్యాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఏపీ మోడల్ జూనియర్ కళాశాల వరకు అన్ని రకాల పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు విద్యాభ్యాసానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు కూడా పాఠశాలలకు చేరాయి. గురువారం కొన్ని పాఠశాలల్లో హాజరైన విద్యార్థులకు పుస్తకాలు కూడా అందజేశారు. వారికి అందజేయాల్సిన యూనిఫాం, బ్యాగ్‌లు, షూష్ లాంటివి త్వరలో నిర్వహించబోయే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో అందజేయనున్నట్లు తెలుస్తోంది. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు కొంత మేర అందుబాటులో ఉండగా యూనిఫాం, షూష్, బ్యాగ్‌లు లాంటివి ఇంకా పాఠశాలలకు చేరలేదు. వేసవి సెలవుల అనంతరం మొదటి రోజు పాఠశాలలకు హాజరైన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. మండలంలోని అన్ని పాఠశాలల్లో సుమారు 4000 మంది వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా తొలిరోజు 2024 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల హాజరు శాతం 58గా ఉంది. అయితే హాజరైన విద్యార్థుల్లో మొదటి రోజు 1394 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేశారు. మరో రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పాఠశాలలకు విద్యార్థులు హాజరు కానున్నారు. అయితే తొలి రోజు పాఠశాలలకు హాజరైన విద్యార్థుల్లో కొంత మంది విద్యార్థులే గత ఏడాది ఇచ్చిన యూనిఫాంలో హాజరు కాగా, కొందరు సాధారణ దుస్తుల్లోనే హాజరయ్యారు.

నాదెండ్లలో తొలిరోజు 40 శాతం హాజరు

నాదెండ్ల: పాఠశాలల పునఃప్రారంభంతో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. మండలంలోని 64 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులు 40 శాతం వరకూ హాజరయ్యారు. మండల విద్యా వనరుల కేంద్రం నుంచి ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఈ విద్యా సంవత్సరం పాఠ్య, నోటు పుస్తకాలు అందించారు. శ్రీసర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కానుక ద్వారా అందించే బ్యాగు, షూ, బెల్టు, సాక్సులు, యూనిఫాం పంపిణీ కానున్నాయి.

ఈ నెల 20న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరగనుంది. గతేడాది కన్నా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. కొన్ని ప్రాథమిక పాఠశాలలు అపరిశుభ్రంగా ఉండటం, వర్షాల కారణంగా లోతట్టుగా ఉన్న పాఠశాలల ఆవరణలు నీళ్లమయంగా మారి విద్యార్థులకు ఇబ్బందులు కలిగాయి. గణపవరం జీపీ క్వార్టర్స్, రాజీవ్‌గాంధీ కాలనీ పాఠశాలల్లో ఆటస్థలాలు లోతట్టుగా ఉండటంతో వర్షపునీరు నిలిచి విద్యార్థుల ఆటలకు ఆటంకం కలిగింది.

వినుకొండలో...



వినుకొండ: వేసవి సెలవులు అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమైయ్యాయి. తొలిరోజున కొంతమంది విద్యార్థిని విద్యార్థులు కొంతమంది యూనిఫాంలో, మరికొంత మంది సాధారణ దుస్తుల్లో బడులకు హాజరయ్యారు. ప్రభుత్వ హైస్కూల్, బాలికల పాఠశాలతోపాటు, ప్రైమరీ, యూపీ స్కూళ్లకు కూడా చిన్నారులు హాజరయ్యారు. పాఠశాలల్లో ఎక్కడా నూతన పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ జరుగలేదు.

యోగాతో మానసిక ప్రశాంతత

–యోగాసనాలు వేసిన కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది



నరసరావుపేట: యోగా మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం యోగా వీధిలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజలు, యువత దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి గరుడ సేవ



సత్తెనపల్లి: జ్యేష్ఠ మాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగాపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి విశేషంగా శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండు ఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలను శ్రీవారికి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజస్వామి శ్రీ, భూ, పురుష, నీలా, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం పురవీధులలో మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూమికి బలం

- రైతులకు పెట్టుబడులు తగ్గుముఖం
- రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు


పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట ఎరువు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను ప్రారంభం ముందు రైతులు పచ్చిరొట్ట ఎరువు సాగు చేయటానికి ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలను జీలుగులు, పిల్లిపెసర, జనుము, విత్తనాలు సాగుకు సమాయాత్తం అవుతున్నారు. ఎకరానికి 10 కేజీలు చొప్పున చల్లాలి. విత్తనం చల్లిన నెల రోజుల తదుపరి ఏపుగా పెరిగిన తరువాత పచ్చిరొట్టను ట్రాక్టరుతో తొక్కించి భూమిలో కలిసేటట్లు దుక్కిదున్నాలి. దీంతో మొత్తం కుళ్లి భూమిలోకి ఇంకిపోతుంది. తర్వాత వారం రోజులకు గొర్రు, గుంటుక, రోటవేటరుతో భూమిని శుభ్రపరుచుకుని పంట సాగు చేసుకోవాలి. పచ్చిరొట్టె సాగు చేసిన భూముల్లో పోషకాల శాతం పెరిగి రసాయనిక ఎరువులు వినియోగం పూర్తిస్థాయిలో తగ్గుతుంది. దీంతో రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగి రైతులు ఆర్థిక ప్రగతి సాధిస్తారు. నత్రజని, భాస్వరం, పొటాష్ సేంద్రియ రూపంలో భూమిలో కలిసిపోతాయి. ప్రస్తుతం రైతులు వినియోగించే రసాయనిక ఎరువులు వలన వాతావరణంలో కాలుష్యం పెరిగి మానవాళికి పెనుముప్పు వాటిల్లుతుంది. రైతుల్లో చైతన్యం పెరిగి అధికంగా సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రాయితీపై అందజేస్తున్నాం



రానున్న ఖరీఫ్ సీజనుకు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను అన్నీ రైతుసేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై జీలుగులు, జనుము, పిల్లిపెసర తదితర విత్తనాలను రైతులకు అందజేస్తున్నాం. రైతులందరూ సద్వినియోగం చేసుకొని పచ్చిరొట్టె ఎరువు సాగువైపు ఆసక్తి చూపాలి. ఖరీఫ్‌కు నెల రోజుల ముందుగా పచ్చిరొట్ట ఎరువు సాగు చేయటం ద్వారా భూమిలో కావల్సిన అన్నీ రకాల పోషకాలు సమృద్ధిగా లభ్యమవుతాయి.

– బోయపాటి రవిబాబు, ఏడీఏ వినుకొండ